# ప్రజల మాట ప్రగతి బాట

# మేడ్చల్ నియోజకవర్గం

## మానసిక, వ్యక్తిత్వ వికాస నిపుణులు మహిపతికి భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



మహిపతి శ్రీనివాస్‌రావుకు భారత్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న న్యాయనిర్ణేత దేవేందర్ బండారి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 13 : 'మన పండుగలు.. మానసిక ఆరోగ్యం' అనే అంశంపై రెండు గంటల పాటు అవగాహన కల్పించిన అనురాగ్ యూనివర్శిటీ అడ్మిన్ డైరెక్టర్, మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణులు మహిపతి శ్రీనివాస్‌కు భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీ మనోజాగృతి ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య సమస్యలు నివారించటంలో భాగంగా 'వరల్డ్ మెంటల్ హెల్త్ డే' కార్యక్రమం జరిగింది. రెండు గంటల పాటు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించిన మహిపతి శ్రీనివాస్‌రావుకు భారత్ వరల్డ్ రికార్డు–2023 లభించింది. న్యాయ నిర్ణేత దేవేందర్ బండారి చేతుల మీదుగా ఆయన భారత్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో మనో జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ గీత చల్లా, యూనివర్శిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి

దుండిగల్,అక్టోబర్13: రాబోయే ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ పార్టీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఇటీవల నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ స్వతంత్ర కార్పొరేటర్ పైడి మాధవి బీఆర్ఎస్ పార్టీలోకి చేరిన సందర్భంగా ఆ పార్టీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రంగరాయప్రసాద్ మర్యాదపూర్వకంగా శాలువతో సత్కరించి అభినందించారు. పార్టీ అభివృద్ధితో పాటు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గెలుపు కోరుతూ సహాయశక్తుల్లా కలిసికట్టుగా పని చేయాలని కోరారు.

## బతుకమ్మ వేడుకలకు రావాలని ఆహ్వానాలు



మేయర్ కొలన్‌నీలాగోపాల్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు

దుండిగల్,అక్టోబర్13: బతుకమ్మ సంబరాలకు హజరుకావాలని కోరుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు శుక్రవారం మేయర్‌కు ఆహ్వాన పత్రాలను అందించారు. ప్రజలు బతుకమ్మ వేడుకలను జరుపుకునేందుకు అన్నీ రకాల మౌలిక సదుపాయాలను కల్పించామని, ఏలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని మేయర్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతినగర్ సాయికృష్ణాజా కాలనీ అసోసియేషన్ సభ్యులు, సాయికృష్ణా కాలనీ సభ్యులు ప్రతినిధులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

జగద్గిరిగుట్ట, అక్టోబర్13: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాలమేరకు .. సూర్యాపేటకు కు చెందిన చంద్రశేఖర్(32) జగద్గిరిగుట్ట షిర్డీ హిల్స్‌లో నివాసముంటాడు. రియల్ ఎస్టేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ఇతనికి భార్య రేణుక, కుమార్తె, కూతురు ఉన్నారు. మద్యం తాగుడుకు అలవాటు పడిన చంద్రశేఖర్ కొంతకాలంగా పనిలేక ఖాళీగా ఉంటున్నాడు. ఈ విషయమై తరచూ దంపతుల మధ్య గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం అతని భార్య, పిల్లలు స్వగ్రామం వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న చంద్రశేఖర్ ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

## బతుకమ్మ సంబురాలు



ఘట్‌కేసర్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



జగద్గిరిగుట్ట(శామీర్‌పేట)లో గురుకుల డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్/శామీర్‌పేట, అక్టోబర్ 13 : ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ ఉన్నత బాలిక పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. శనివారం నుంచి దసరా సెలవులు కావడంతో ఒక రోజు ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థినులు వేడుకలను నిర్వహించారు. ఇంటి వద్దనే అడవి పూలతో బతుకమ్మలను తయారు చేసి తెచ్చి ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మ పాటలు పాడి ఆడారు. హెచ్ఎం అనిత, ఉపాధ్యాయులు,విద్యార్థినులు పాల్గొన్నారు.

**జగద్గిరిగుట్ట గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో..**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట(శామీర్‌పేట)లో శుక్రవారం బతుకమ్మ సంబురాల జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్, వైస్ ప్రిన్సిపాల్ చేతన, విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పేర్కొన్నారు.

# 'గడపగడపకు బీఆర్ఎస్ సంక్షేమ పథకం'

- ప్రజలకు వివరిస్తూ..అభ్యర్థుల గెలుపునకు ముందుకు
- పార్టీ దిశా-దశలపై బూత్‌స్థాయిలో విస్తృతస్థాయి సమావేశాలు



కొంపల్లిలో మాజీ ఎంపీపీ సన్న కవిత ఆధ్వర్యంలో బూత్‌స్థాయి సమావేశానికి హాజరైన కార్యకర్తలు



కుత్బుల్లాపూర్ డివిజన్‌లో ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతుగా పద్మానగర్‌ఫేస్–2 సంక్షేమ సంఘం ఏకగ్రీవ తీర్మానాన్ని అందుకుంటున్న మాజీ కార్పొరేటర్ గౌరీశ్

కుత్బుల్లాపూర్,అక్టోబర్13: గులాబీ సైన్యం తమ ప్రచారాన్ని మరింత స్పీడ్‌ను పెంచింది. జరగబోయే ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచే ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించకునేలా బూత్ స్థాయి కమిటీల నుంచి కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ క్రీయాశీలక నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా డివిజన్ల అధ్యక్షులు, కమిటీ నిర్వాహకులతో పాటు బూత్‌స్థాయిలో కార్యకర్తలతో క్షేత్రస్థాయిలో సమీక్షలను ఏర్పాటు చేసుకొని గెలుపు దిశగా తీసుకోవాల్సిన పలు అంశాలను చర్చించారు. 129 సూరారం డివిజన్, 125 గాజులరామారం డివిజన్, 128 చింతల్ డివిజన్‌తో పాటు కొంపల్లి మున్సిపాలిటీల పరిధిలో పార్టీ బూత్ స్థాయి సమావేశాలను నిర్వహించారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేస్–2 అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గెలుపునకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేసి మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీశ్‌కు అందించారు.

## పెండింగ్ సమస్యలు సకాలంలో పరిష్కరించాలి



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాలనీల్లో ఇప్పటికే వంద శాతం మౌలిక సదుపాయాలను కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం పేట్ బషీరాబాద్‌లోని తన నివాసంలో నియోజకవర్గానికి చెందిన పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక సమస్యలపై వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఎమ్మెల్యే కు రుడామిస్త్రీనగర్ వాసుల ఏకగ్రీవ మద్దతు




ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేస్తున్న మసీద్ ప్రతినిధులు

జీడిమెట్ల, అక్టోబర్13: ఎమ్మెల్యే వివేకానంద్‌ను మూడోసారి గెలిపించుకుంటామని రుడామిస్త్రీనగర్–ఎ వాసులు అన్నారు. చింతల్ పరిధి ఈద్గా డెవలెప్‌మెంట్, జామామసీద్ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశమయ్యారు. ఆయనకు మద్దతు పలుకుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిపనులకు వివేకానంద్ సహకారం మరువలేనిదన్నారు. సమవేశానికి అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు తీర్మాన పత్రాన్నిఅందజేశారు. మఖ్సూద్‌అలీ, రషీద్, బషీర్, అప్సర్‌అలీ, యూనస్‌ఖాన్, మీర్జాఅలీబేగ్, ఉస్మాన్, రసూల్, అర్మాన్‌ఖాన్, హబీబుద్దీన్ పాల్గొన్నారు.

## వృద్ధుడు అదృశ్యం

జగద్గిరిగుట్ట, అక్టోబర్13: ఇంటినుంచి వెళ్లిన వృద్ధుడు కనిపించకుండా పోయిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. దీనబంధు కాలనీలో డ్రైవర్‌గా పనేచేసే రమేశ్ కుటుంబంతో నివాసముంటాడు. కాగజ్‌నగర్‌లో ఉండే అతని తండ్రి నారాయణ (75) వారం క్రితం రమేశ్ వద్దకు వచ్చాడు. ఇంటినుంచి శుక్రవారం మధ్యాహ్నం బయటకు వెళ్లిన వృద్ధుడు తిరిగిరాలేదు. చుట్టు పక్కల గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో అతని కుమారుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేశారు.

## నేటి నుంచి చిత్తారమ్మ దేవాలయంలో పూజలు

దుండిగల్,అక్టోబర్13: గాజులరామారం డివిజన్ చిత్తారమ్మ దేవాలయంలో దేవీనవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అంతయ్యగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.